క్లుప్తంగా

ఉత్తమ సేవా పురస్కార గ్రహీతకు సన్మానం



సత్తెనపల్లి: 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం పొందిన సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.ఎం. ఇస్మాయిల్‌ను సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండం బాబూరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవరశెట్టి రవికుమార్, ఆళ్ల జగన్నాధం, షేక్ జనమ్మ, షేక్ మస్తాన్ బీ, యార్డ్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన అవసరం



సత్తెనపల్లి: కుష్ఠు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని డాక్టర్ జి.భాను ప్రకాష్ అన్నారు. పట్టణంలోని 13వ సచివాలయంలో ఈ వ్యాధిపై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డాక్టర్ భాను ప్రకాష్ మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధిపై అవగాహన కలిగించడానికి యాక్షన్ ప్లాన్ తయారు చేసినట్లు చెప్పారు. 15 రోజుల పాటు సిబ్బంది అంతా కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తూ వార్డుల్లో సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. స్పర్శ లేని రాగి రంగు మచ్చలు కలిగి ఉంటే అటువంటి వారిని వైద్యశాలకు రిఫర్ చేయాలని సూచించారు. కుష్ఠు లేని సమాజాన్ని ఏర్పాటు చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండి మల్లికార్జునరెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, అడ్మిన్ సెక్రటరీ షేక్ కరిముల్లా, ఏఎన్ఎమ్ బాహాటం రత్న పుణ్యవతి, వలంటీర్లు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపట్ల అవగాహన

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): కుష్ఠు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ముప్పాళ్ళ పీహెచ్‌సీ వైద్యులు పి.జయకృష్ణ చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవంలో భాగంగా కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పాల్గొన్న వైద్యులు జయకృష్ణ మాట్లాడుతూ కుష్ఠువ్యాధి ప్రారంభమనేది స్పర్శ లేని మచ్చల ద్వారా వస్తుందన్నారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పాళ్ళ ఎస్సైగా హజరతయ్య



ముప్పాళ్ళ: సాధారణ బదిలీల్లో భాగంగా ముప్పాళ్ళ ఎస్సై గా పీ.హజరతయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేట రూరల్ ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ముప్పాళ్ళకు వచ్చారు. గతంలో రొంపిచర్ల మండలం ఎస్సైగా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సత్తెనపల్లి డీఎస్పీ బీ. ఆదినారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు.

పేదల ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం



అమరావతి: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ధరణికోట-1 సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడికి నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించటానికే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గంగాధర శ్రీనివాసన్, మండల వైద్యాధికారి డాక్టర్ రవిబాబు , డాక్టర్ శివరత్న కుమార్, డాక్టర్ కల్యాణి , గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటాద్రి, పలువురు వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

3న సీజింగ్ వాహనాల బహిరంగ వేలం

నకరికల్లు: పలు కేసులలో సీజ్ చేసిన వాహనాలను ఫిబ్రవరి 3న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఐ పైడి రాంబాబు మంగళవారం తెలిపారు. ఆసక్తి గల పాటదారులు నకరికల్లు పోలీసు స్టేషన్ ఆవరణలోఉన్న వాహనాలను ముందుగా పరిశీలించుకోవచ్చని చెప్పారు. వేలంలో పాల్గొనే ముందుగా వేలం అధికారి వద్ద రూ.2వేలు డిపాజిట్ చేయాలని సూచించారు.

ఆడుదాం ఆంధ్రాతో గ్రామీణ క్రీడలకు మహర్దశ

- పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- నియోజకవర్గ స్థాయి విజేతలకు బహుమతులు అందజేత



గెలుపొందిన మహిళా జట్టుకు పతకం అందిస్తున్న ఎమ్మెల్యే

క్రోసూరు: క్రీడల్లో మట్టిలో మాణిక్యాలను వెలికి తీసి ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తోందని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. క్రోసూరు జిల్లా పరిషత్ స్కూల్ ఆవరణలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి విజేతలకు ఎమ్మెల్యే బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ దేశంలోనే ఆటల పండుగను తెచ్చిన ప్రభుత్వం సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమన్నారు. ప్రభుత్వమే ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ ఉన్నవారిని గుర్తించి వారికి మెరుగైన శిక్షణ ఇప్పిస్తుందన్నారు. తద్వారా వెలుగులోకి రాని మాణిక్యాలను ప్రపంచ స్థాయికి ఎదిగేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. క్రికెట్ పురుషుల విభాగంలో బెల్లంకొండ మొదటిస్థానం సాధించగా అచ్చంపేట, అమరావతి రెండు మూడు స్థానాలు సాధించాయి. కబడ్డీ పురుషుల విభాగంలో అచ్చంపేట మొదటి స్థానంలో నిలిచింది. పెదకూరపాడు, క్రోసూరు రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి. కబడ్డీ మహిళల విభాగంలో అచ్చంపేట మొదటి స్థానం సాధించగా పెదకూరపాడు రెండో స్థానం దక్కించుకుంది. వాలీబాల్ పురుషుల విభాగంలో అచ్చంపేట మొదటి స్థానం, బెల్లంకొండ రెండో స్థానం, అమరావతి మూడో స్థానంలో నిలిచాయి. షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో అచ్చంపేట విజయం సాధించగా.. అమరావతి, బెల్లంకొండ రెండు మూడు స్థానాల్లో నిలిచాయి. షటిల్ బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో అమరావతి విజయం సాధించగా.. క్రోసూరు, అచ్చంపేట తర్వాతి స్థానాలలో నిలిచాయి. ఖోఖో పురుషుల విభాగంలో క్రోసూరు విజయం సాధించగా బెల్లంకొండ రన్నరప్‌గా నిలిచింది. ఖోఖో మహిళల విభాగంలో క్రోసూరు విజయం సాధించగా, అమరావతి రన్నరప్‌గా నిలిచింది.ఈ కార్యక్రమంలో యార్డు చైర్మన్ ఈదాసాంబిరెడ్డి, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ సభ్యుడు షేక్ జమీలా గఫూర్, వెలదిఅప్పారావు, అనుముల కోటిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ డాక్టర్ షరీఫ్, పట్టీల శ్రీనివాసరావు, పలువురు పార్టీనాయకులు పాల్గొన్నారు.



పురుష క్రీడాకారులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

గాంధీజీ ఆశయాలు వైఎస్సార్‌సీపీ పాలనతో సాకారం



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గాంధీచౌక్‌లో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

- వాడవాడలా బాపూజీ వర్ధంతి
- వృద్ధులకు అల్పాహారం అందజేత

సత్తెనపల్లి: జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని గతంలో పుస్తకాల్లో మాత్రమే చదువుకునే వాళ్లమని.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధింపజేసి గాంధీజీ కలలను సాకారం చేశారని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం జరిగిన మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చలంచర్ల మాట్లాడుతూ సత్యం, అహింస మార్గాలతో దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహాత్ముడి అడుగుజాడల్లోనే ముఖ్యమంత్రి వైయస్. జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామ స్వరాజ్యాన్ని సిద్ధింపజేశారన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆర్యవైశ్య నాయకుడు, వైఎస్సార్ సీపీ వాణిజ్య భాగం రాష్ట్ర కార్యదర్శి వెలుగూరి శరత్ ఆధ్వర్యంలో కలాం చేయూత కార్యక్రమం కొనసాగుతూనే ఉందన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని 28వ వార్డుకు చెందిన ముసుగు భాస్కరరావు, 20వ వార్డుకు చెందిన భవిరిశెట్టి మణిదీప్‌లకు చిరు వ్యాపారాలు నిమిత్తం తోపుడు బండ్లను ఆయన అందించారు. ఈ బండ్లను నాయకులు షేక్ గని, కూకట్ల శ్రీనివాసరావులు అందజేశారు. ఆయా కార్యక్రమాలల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్ మీరాన్, పార్టీ రాష్ట్ర నాయకులు రాజవరపు శివనాగేశ్వరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, వాణిజ్య భాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, పార్టీ నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు (బుల్లోడు), కాటుమాల డేవిడ్, షేక్ మొహమ్మద్ గని, తుమ్మల వెంకటేశ్వరరావు, నందిగామ ఆదాం, ఉల్లంగుల ప్రసాద్ బాబు, గుంటూరు జానీ, జూపల్లి పాల్ పరువు లు, తదితరులు పాల్గొన్నారు.

● దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు గాంధీజీ అని ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సత్తెనపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముందుగా పట్టణంలోని మాతృశ్రీ మొల్లమాంబ అనాథ వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అల్పాహారం అందించారు. గాంధీ చౌక్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మహాత్మా గాంధీ జీవితంలో అనేక ముఖ్య ఘట్టాలను తెలియజేశారు.కార్యక్రమములో ఆర్యవైశ్య సంఘ నాయకులు కొత్త లక్ష్మయ్య, జవ్వాజి రామమోహన రావు,పెరుమాళ్ళ శివన్నారాయణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

● జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను నెరవేరుద్దామని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అడిషనల్ వైస్ గవర్నర్ ఆత్మకూరి వెంకట హరే రామ చెంచయ్య అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి పోలేరమ్మ గుడి వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆర్యవైశ్య సంఘం మహిళా మండలి అధ్యక్షురాలు జవాజి లక్ష్మి, బోండా వెంకటేశ్వరరావు, కోట వెంకట బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ మార్గం అనుసరణీయం

బెల్లంకొండ: జాతిపిత బాపూజీ చూపిన శాంతి మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఎంపీడీఓ బి.వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాత్ముని చిత్ర పటానికి ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గాంధీజీ దేశానికి అందించిన సేవలను గుర్తు చేశారు. బ్రిటీష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ కలిగించేందుకు మహాత్ముడు చేసిన సేవలను కొనియాడారు. ఏపీవో కోటమ్మ, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీజీకి నివాళులు

క్రోసూరు: జాతిపిత మహాత్మాగాంధీ 76 వ వర్ధంతి కార్యక్రమాన్ని క్రోసూరు పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ అధికారులు సోమవారం నిర్వహించారు. పంచాయతీ విస్తరణాధికారి పి.శివరామయ్య, పంచాయతీ కార్యదర్శి నాయక్, సిబ్బంది పాల్గొని మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గాంధీజీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని, అపుడే దేశం శాంతియుతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లా చందమామ, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన ఆర్యవైశ్య నాయకులు



పార్టీలో చేరిన ఆర్య వైశ్య నాయకులతో మంత్రి అంబటి

సత్తెనపల్లి: పట్టణంలోని 11వ వార్డుకు చెందిన ఆర్యవైశ్య చలివేంద్రం అధ్యక్షుడు సింగరి మధుసూదనరావు, 14వ వార్డుకు చెందిన చాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ చైర్మన్ కనమర్లపూడి సుబ్బారావు, 25వ వార్డుకు చెందిన అన్నం నాగ సత్యనారాయణలు మంగళవారం రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువాలు కప్పారు. పార్టీ స్థానిక నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, ఉల్లంగుల ప్రసాద్‌బాబు, మాడా రమేష్, పట్టణ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి



అచ్చంపేట: భవిష్యత్‌లో వృత్తి విద్యలు ఉపాధిని అందించే కోర్సులుగా మారుతాయని ఒకేషనల్ ఉపాధ్యాయులు గొలపల్లి రాఘవేంద్రసాయి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్యల పట్ల మంగళవారం అవగాహన కల్పించారు. ఇండస్ట్రియల్ విజిట్ కోసం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యార్థులను తీసుకెళ్లారు. ప్రిన్సిపాల్ టి.అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు, ఒకేషనల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి ప్రతిభ పోటీలు

పెదకూరపాడు: మండల పరిధిలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామ్‌ఫా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటి కన్వీనర్ పి.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయుడు అన్నపరెడ్డి శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం తదితర విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు జిల్లా కలెక్టర్ శివశంకర్, డీఈఓ శామ్యూల్, సత్తెనపల్లి ఉపాధ్యాయ శాఖ అధికారి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు.

గోళ్లపాడులో ఆరోగ్య సురక్ష శిబిరం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామ సచివాలయం పరిధిలో ఎంపీయుపీ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో ఆయా విభాగాల స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని పేదలకు వైద్యసేవలందించినట్లు పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ తెలిపారు. డా.వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి వైద్య నిపుణులు పాల్గొని కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్ళజోళ్లు అందించారు. శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి, ప్రోగ్రామ్ నోడల్ అధికారి రవీంద్ర రత్నాకర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

హైస్కూలుకు క్రీడాసామగ్రి అందజేత

నాదెండ్ల: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సాతులూరు కెనరా బ్యాంక్ అధికారులు సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.1.65 లక్షల విలువైన క్రీడా సామగ్రిని మంగళవారం అందించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ, ప్రతి ఏడాది బ్యాంక్ తరపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకోవటమే కాక, క్రీడల్లో కూడా రాణించి ఉజ్వల భవితను సాకారం చేసుకోవాలన్నారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ ఉమామహేశ్వరరావును హెచ్ఎం వి.వెంకటరావు, పీడీ కె.అంజమ్మ, ఉపాధ్యాయులు ఆయన్ను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

అచ్చంపేట: అచ్చంపేటకు చెందిన గాదె వీరాంజనేయులు జనసేన పార్టీని వీడి తన అనుచర గణంతో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. భారీ బైక్ ర్యాలీతో అచ్చంపేట నుంచి క్రోసూరులోని ఎమ్మెల్యే కార్యాలయానికి తన అనుచరులతో తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, వీటన్నింటినీ చూసి టీడీపీ, జనసేన పార్టీల నుంచి భారీగా కార్యకర్తలు తరలి వస్తున్నారని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, మేలు జరిగిన ప్రతి కుటుంబం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, జిల్లా బీసీ కార్యదర్శి సాతర్ల శ్రీనివాసరావు, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, అచ్చంపేట పార్టీ కన్వీనర్ డాక్టర్ సమరం, సొసైటీ మాజీ అధ్యక్షుడు యల్లమందయ్య, జేసీబీ మర్రెడ్డి తదితరులు ఉన్నారు.

స్థాయి లేనివారికి విమర్శించే హక్కులేదు

కంచేటి సాయిపై ధ్వజమెత్తిన వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

క్రోసూరు: టీడీపీ నాయకుడు కంచేటి సాయి స్థాయి ఏంటో తెలుసుకోకుండా ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై ఆరోపణలు చేయటం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంచేటిసాయి మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కంచేటి సాయిబాబు స్థాయి ఏమిటని ప్రశ్నించారు. పార్టీలో ఓ స్థాయి గల వారు ఎమ్మెల్యే అవినీతి చేసారని ఆరోపిస్తే దానికి వైఎస్సార్‌సీపీ సమాధానం ఇస్తుందన్నారు. క్రోసూరు జెడ్పీటీసీ సభ్యుడు జమీలా గఫూర్ మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో పార్టీల పరంగా ఎప్పుడూ గొడవలకు దిగలేదని, కంచేటిసాయి వచ్చి ప్రజలను రెచ్చగొడుతున్నాడని, ఘర్షణలకు కారణమవుతున్నాడని అన్నారు. నిన్నటిదాకా వైఎస్సార్‌సీపీలో ఉన్న కంచేటి సాయికి ఇప్పుడే అవినీతి కనపడిందా అని ప్రశ్నించారు. స్థాయిని మరిచి మాట్లాడితే ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో గులాబీ రంగు పురుగు నివారణ



మొక్కజొన్న పైరు

రొంపిచర్ల: మొక్కజొన్న పైరును గులాబీ రంగు మొవ్వ తొలుచు పురుగు ఆశిస్తుందని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. మొక్కజొన్న పైరుపై రెక్కల పురుగులు ఆకుతొడుగు మీద, ఆకు అడుగా భాగాన 80 నుంచి 100 గుడ్ల వరకు పెడతాయి. గుడ్లు పెట్టిన నాలుగైదు రోజులలోనే లార్వాలు వెలువడి మొదటిగా ఆకుమీద గోకి మొవ్వ లోపలికి వెళ్లి విప్పారిన ఆకులను తినడం ప్రారంభిస్తాయి. ఆకులు విచ్చుకోకుండా వరుసగా ఆకులపై రంధ్రాలు కనిపిస్తాయి. లార్వాలు ఎదుగుతున్న మొవ్వని తినడం వల్ల మొక్కలు 16 రోజులకే చనిపోతాయి. 20 రోజుల పైబడిన పైరుకు ఆశిస్తే గులాబీ రంగు పురుగు వల్ల 20 శాతం మీర మొక్కలు చనిపోతాయి. గులాబీ రంగు పురుగు నివారణకు మొక్కజొన్న విత్తిన 10-12 రోజుల వ్యవధిలో విధిగా ఎకరానికి 500 మిల్లీలీటర్ల క్లోరిపైరీపాస్ లేదా 60 మిల్లీలీటర్ల క్లోరాంట్రి నిలిప్రోలుని పిచికారి చేసుకోవాలన్నారు. ఆ సమయంలో మందు పిచికారీ చేయని ఎడలా మొక్కలు చనిపోవటం గమనించి వెంటనే ఎకరానికి 60 మిల్లీ లీటర్ల ట్రెసర్ లేదా 100 మిల్లీలీటర్ల డెలిగేట్ లేదా 80 గ్రాముల ప్రొక్లెం మందును ఏదో ఒకదానిని తీసుకొని అవసరాన్ని బట్టి ఏడు రోజుల వ్యవధిలో రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేసుకోవాలన్నారు. ఎకరాకు 2 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను మొక్కల మొవ్వలలో వేసుకొని నివారించుకోవచ్చని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం



ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న వీహెచ్‌పీ సభ్యులు, భక్తులు

వినుకొండ (నూజెండ్ల): ప్రముఖ కర్ణాటక సంగీత వాగ్గేయ కళాకారులు, నాదోపాసన ద్వారా భగవంతుడిని దర్శించిన సంగీత బ్రహ్మ శ్రీ త్యాగరాజ స్వామి వారి ఆరాధన ఉత్సవాలు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ కోదండరామ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రుల చిత్రపటం, శ్రీ త్యాగరాజస్వామి పటంతో నగర సంకీర్తన, స్వామివారికి అభిషేకం, విశేష అర్చన నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం, ప్రత్యేక భజనలు, భక్తిపాటల ఆలాపన చేశారు. కార్యక్రమంలో చందలూరి సుబ్బారావు, కోటా మల్లికార్జున రావు, వీహెచ్‌పీ సభ్యులు భాగవతుల రవికుమార్, గజవల్లి నాగ పవన్‌కుమార్, కె.సుబ్బారావు, విజి బాలరావు, గోనుగుంట్ల ఘంటారావు, బి.సాంబశివరావు, కె.భద్రయ్య, పూజారి చంటి, కోట రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ తులసి
- ముగిసిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు

సత్తెనపల్లి: పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలు వార్డుల కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకు వచ్చారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన మంగళవారం జరిగింది. 31వ వార్డు కౌన్సిలర్ తురక మేరీగ్రేస్ మాట్లాడుతూ పట్టణంలోని 11వ వార్డు ఎన్జీవోస్ కాలనీలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్ భవనానికి మంచినీటి సరఫరా నిమిత్తం హెచ్‌డీపీఈ పైప్ లైన్ ఏర్పాటుకు ఎక్కువ నిధులను ఖర్చు చేస్తున్నారన్నారు. ఆ వార్డు పట్టణానికి శివారులో ఉందని అక్కడ జనాభా తక్కువగా ఉన్నప్పటికీ ఎక్కువ నిధులను ఖర్చు చేస్తున్నారన్నారు. జనం లేని చోట 24 అడుగుల రోడ్డు వేయాల్సిన అవసరం ఏముందన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన లైటింగ్ పట్టపగలు వెన్నెలలా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది తక్కువ రోజులు నీటిని విడుదల చేశారని, అయినప్పటికీ గత ఏడాది కంటే ఎక్కువ నీటిని నింపామన్నారు. ర్యాటిఫికేషన్ చేసేది టెండర్ ఒపీనియన్ కు మాత్రమేనని చెప్పారు. బేసిక్ వర్క్స్‌కు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రోడ్డు నిర్మాణానికి ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ క్లినిక్ భవనానికి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 24 అడుగుల రోడ్డును వేయడం జరుగు తుందన్నారు. మంచినీటి చెరువుకు నీళ్లు నింపే సమయంలో కౌన్సిలర్లు అందర్నీ కూడా తీసుకెళ్తే అక్కడ పరిస్థితి ఏమిటో అర్థమవుతుందన్నారు. 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ వార్డులో శానిటేషన్ అధ్వానంగా ఉందని, ప్రజలు మమ్మల్ని దుమ్మెత్తి పోస్తున్నారన్నారు. తమ వార్డు మురికి వాడల్లో ఉందని వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. తమ వార్డులో స్మశాన వాటిక అభివృద్ధి చేపట్టాలని, దోమలు విలయ తాండవం చేస్తున్నాయన్నారు.15వ వార్డు కౌన్సిలర్ గంటా రమణమ్మ మాట్లాడుతూ తమ వార్డులో మంచినీటి సరఫరా కేవలం 15 నిమిషాల పాటు మాత్రమే వస్తుందన్నారు. సైడ్ కాలువలు నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ మంచినీటి సరఫరా ఫ్లో తక్కువగా ఉన్నందున రోజు మార్చి రోజు ఇవ్వడం జరుగుతుందని, మరీ ఇబ్బంది ఎక్కువగా ఉంటే ట్యాంకర్ ద్వారా పంపుతామన్నారు. దోమల నివారణకు పాగింగ్ చేయిస్తామన్నారు. అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ ప్రకటించగా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు పాల్గొన్నారు.

ఇరు కుటుంబ సభ్యులపై కేసులు నమోదు

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో ఇరువురు కుటుంబ సభ్యులపై కేసులు నమెదు చేసినట్లు ఎస్సై తుళ్ళూరి తిరుపతిరావు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై తెలిపిన వివరాలు మేరకు గ్రామానికి చెందిన రావులపల్లి వీరాంజినేయులు చెందిన కంది పొలంలో అదేగ్రామానికి చెందిన మందా విజయరాజు తన మేకలకు మేత కోస్తున్నాడు. ఈక్రమంలో తన కంది పొలంలో తనకు తెలియకుండా మేత కోయటం ఏమిటని ప్రశ్నించిన రావులపల్లి వీరాంజినేయులు, మందా విజయరాజు కుటుంబ సభ్యుల మధ్య వాదులాటతో పాటు కోట్లాట జరిగినట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలో విచారణ చేపట్టి ఇరు కుటుంబ సభ్యులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

వృత్తి విద్యా కోర్సులతో మంచి ఉపాధి అవకాశాలు

నాదెండ్ల: వృత్తి విద్యా కోర్సుల అభ్యాసంతో భవిష్యత్‌లో మంచి ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని ప్రిన్సిపల్ మాధవీలత చెప్పారు. నాదెండ్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం 9,10, ఇంటర్ విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా తిమ్మాపురంలోని వసంత టెక్స్‌టైల్స్ మిల్లులో ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. ఇండస్ట్రీలో యంత్రాలు పనిచేసే విధానం, పత్తి నుంచి దుస్తుల తయారీ వరకూ ప్రక్రియను పరిశీలించారు. ఎలక్ట్రానిక్ డివైజ్‌లు గురించి మిల్లులో పనిచేసే నిపుణుల గురించి తెలుసుకుని యంత్రాల పనితీరును జనరల్ మేనేజర్ హనుమంత రావు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికపరంగా వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుని ఆధునిక యంత్రాలతో తక్కువ సమయంలో ఎక్కువ ఫలితాన్ని సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ టీచర్ కోటేశ్వరమ్మ, ఆర్ రత్నకుమారి, ఉపాధ్యాయులు తదితరుల పాల్గొన్నారు.